# ప్రయాణం


శ్రీ వాసుదేవరావు గారు

## ౧

ఇంగ్లీషువాళ్లు డ్రెస్సుచేసుకొనే రీతిగా డ్రెస్సు చేసుకోవడం నాకు మహాప్రీతి; అలవాటు కూడాను. ఇంట్లో వున్నప్పుడొక మోస్తరు డ్రెస్సు; బయటికి షికారువెళ్లేటప్పుడొక మోస్తరు డ్రెస్సు; కాలేజికి వెళ్లేటప్పుడింకొక మోస్తరు ఆటలాడేటప్పుడొకటి; అన్నిటికీ అన్నివిధాల డ్రెస్సులూ.

నేను బళ్లారికి ప్రయాణం నిశ్చయించుకొన్నాను. సాయంత్రం మెయిల్‌కు బయలుదేరాలె. బయలుదేరడానికి కొంచెం ముందుగా డ్రెస్సు చేసుకోవడం మొదలు పెట్టాను. ఈ డ్రెస్సు ప్రయాణం డ్రెస్సు.

ప్రయాణంలో 'ఖాకీ' మంచిది. సూట్ అలంకరించాను. మెడకు 'స్టిఫ్ కాలర్'; 'టై' ముచ్చటగ చిన్నముడి పెట్టాను. సూట్‌పైన 'ఓవర్ కోట్' తగిలించుకొన్నాను. చైత్రమాసం కాదా, ఓవర్‌కోట్ యెందుకంటారేమో! కాని, అది ట్రావెలింగప్పుడు ముఖ్యంగా వుండవలసిందే! 'కర్చీఫ్'కు 'లావెండర్ వాటర్' రాచుకున్నాను. క్రాపు చక్కగా దువ్వాను. సాక్సుబూట్సు తొడుక్కున్నాను. పెండ్లికొడుకనుగదా — తగిన రీతిగా అలంకారంచేసుకుని నారూపు చూచుకుందామని నిలువుటద్దముందుట నిలిచాను. అంతలోనే తటాలున వెనక్కితిరిగి చూచాను. ఎవరూ లేరు! మాకాలేజి గణితాచార్యుడు కాంప్సన్‌దొర యిప్పుడువచ్చాడే యింతలో నేమైనాడా అనుకున్నాను. మళ్లీ అద్దంలో చూచుకున్నాను. నాకు నవ్వువచ్చింది. మళ్లీ కాంప్సన్‌దొర రూపం నాకద్దంలో కనబడ్డది.



"మళ్లీ కాంప్సన్‌దొర రూపం నా కద్దంలో కనబడ్డది."

నాకు నవ్వు కడుపుబ్బుతూ వుంది? నా ప్రతిబింబం అద్దంలో చూచుకొని దొర అని భ్రమిశాను. ఏమాత్రమూ భేదం కనబడలేదు. అచ్చంగా అతడే నేనయిపోయినాను. అప్పుడు నా కాముందురోజే జరిగినపొరబాటు జ్ఞాపకానికి వచ్చింది. నేను దొరగారిదగ్గర పనివుండి బంగళాకు వెళ్లాను. వెళ్లేదోవలోనే బంగళాఆవరణలో పూలతోట వుంది. అక్కడ ఆయనగారి చెల్లెలుంది. ఆవిడ నన్నుచూడడంతోటే నవ్వుతూ దగ్గరికి రమ్మని చేసైగ చేసింది. నేను దగ్గిరకు పోయినాను. అప్పుడామె 'క్షమించండి; మాఅన్నయ్య అనుకున్నాను' అన్నది. సాక్షాత్తు చెల్లెలే పొరబాటుపడ్డది. ఇంకొకటి. నన్ను కాలేజిలో అందరూకూడా 'ప్రొఫెసర్ కాంప్సన్‌ది సెకండ్' అనేవారు. అదీ యిప్పుడు జ్ఞాపకానికి వచ్చింది. నే

నీసంభ్రమములో పడి మాఆనందిస్తూవున్నాను. ఇంతలో వాకిట నిలిచిన బండివాడు "వేళ మీరుతూవుంది. తొం దరపడండి" అని కేకపెట్టడం వినబడ్డది. ఉలిక్కిపడి వాణ్ణిపిలిచి ప్రయాణంతోలుపెట్టె, పరుపూ బండ్లో పెట్టమన్నాను. వాడవితీసుకొనిపోయి బండ్లో పెట్టాడు. ఆతర్వాత నేను టక్కు-టక్కుమని బూట్సులు చప్పుడు చేస్తూ మేడమెట్లు దిగివచ్చాను. నాకోసం మా అమ్మ యెదురుచూస్తూవుంది. ఇంకశెలవు తీసుకుంటూ మాఅమ్మకు సాగిలిమొక్కాను. మా అమ్మ నాతల తడివి ప్రేమపూర్వకంగా "సుఖంగా ప్రయాణం చేసి త్వరగా కోడల్ని తీసికొని వత్తువుగాక!" అని దీవించింది అప్పుడామెకళ్లలోనుండి నాలుగైదు అశ్రుబిందువులు నాతల మీద పడినవి. నా అనుగుతల్లి-నామాతృదేవత-ఆనందాశ్రువులను గురిపించి నన్ను అభిషేకంచేసిందనుకొన్నాను. నాలోనే ఈలాటి అమ్మను నాకిచ్చినందుకు పరమేశ్వరుడికి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కారములు చేసినాను.

వేళ అయింది. బండివాడు తొందర పెస్తూన్నాడు. మాఅమ్మ కళ్లల్లో బాష్పాలు కురుస్తూన్నవి. నాకూ కష్టంగానేవుంది. మా అమ్మను వదిలి నేనిప్పుడూ దూర ప్రయాణం చేయలేదు. ఇప్పుడు చేయవలసివచ్చింది. ఏమిచేయను? ప్రయాణం మానుకుందునా? కాదు. అమ్మకు కోడలుకావాలె. ఆమె బలవంతాన్నే యిప్పుడు నాకు ప్రయాణం కలిగింది. ఇప్పుడు మానినా రేపైనా యెల్లుండైనా పోయి పిల్లని చూచిరావలసిందేకాదా. ప్రయాణం మానడానికి వీలులేదు. నేనుమానినా అమ్మ మాననివ్వదు. మనస్సు విచారంలో మునిగిపోయింది. అయినా తప్పదు. గుండె నిబ్బరించుకొన్నాను. కాని, నాకన్నీ ళ్లాపుకోలేకపోయినాను. కాని, లోపలిదుఃఖం పైకుబుకుతూవున్నా అణచుకొన్నాను.

"అమ్మా, బండివేళ అయింది. వెళ్లివస్తాను" అని అనలేక అనలేక మాటలు తడబడుతూ అన్నాను.

మాఅమ్మ కండ్లుతుడుచుకుంటూ, "బాబూ, జాగ్రతసుమా! పిల్లవేపువారని వాళ్లని ఆయాసపెట్టకు. వినయంతో ప్రవర్తించు. హైద్రాబాదీ బడాయి చూపకు. ఇక్కడ నాతో మాట్లాడేమాదిరిగా పిచ్చిపిచ్చిగా మాట్లాడకు. నీ కివన్నీ నేచెప్పనవసరం లేదు. నీకు తెలీనిదేముంది? అయినా, కన్న కడుపు; తల్లిప్రేమ. ఎన్నడూ నిన్నువిడిచి నేనుండలేదు. సుఖంగా, వెళ్లి సంతోషంగా రా, నాన్నా!" అన్నది.

నేను మళ్లీ అమ్మకు నమస్కారంచేసి బయటికి వచ్చి బండ్లో యెక్కినాను. మాఅమ్మ బయటికివచ్చి నిలిచింది. బండి నడవసాగింది. అమ్మ నాకు కనబడినంత దూరమూ చూస్తూనేవున్నాను. బండి మరుగుపడ్డది. అమ్మ ముఖం కనబడలేదు. అప్పుడు నాకు కడుపులో ఒకవిధమైన వికారం పుట్టుకొచ్చింది. అది యీలాటిదని చెప్పలేను. మహాసముద్రంలో అలలవలె దుఃఖం పొట్టపొంగి పొర్లిపోతూ వున్నది. బండి ముందుకు సాగుతూంది. మనసు వెనక్కి లాగుతూన్నది. ఏమిచేయను? ప్రయాణం మాననా? బండి నింటికి తిప్పమందునా? కాదు. రేపైనా ప్రయాణం చేయాలిసిందేగా? మనస్సు పదిలపరచుకున్నాను.

ఎట్లాగైతే నేమి స్టేషన్ చేరినాను. మెయిల్ బయలుదేరడానికి సెకండ్ బెల్ ఇచ్చారు. ఆదావిడిగ పోయి టిక్కెట్టుకొని ప్లాట్ ఫారంవచ్చి రైలులో సెకండ్ క్లాస్ లో యెక్కి కూర్చున్నాను. కూలివాడు పోర్టుమాంటో బెడ్డింగ్ తెచ్చి బండ్లో పెట్టినాడు.

రైలుబండి నడవసాగింది. నాహృదయంలో అమ్మను విడిచివచ్చినవిచారం వకవేపున, పెండ్లికూతును చూడ పోతున్నానన్న సంభ్రమ మొకవేపున, ముట్టుముట్టుకున్నవి. ఏంచేయను? ఈరెండవస్థలూ మరుపుకలగాలెనని యెంతెంతో ప్రయత్నించాను. కాని, యెవరినిమరువను? అమ్మను మరవనా? అదిసాధ్యమా? ఆప్రేమామృతమొలుకుతూండే మాటలూ, ఆవాత్సల్యపూర్ణమైన చూపులూ, ఆ దయాపూరితమైన ఉపదేశాలు, ఆమమత, ఇదిఅది అననేల? నన్నింతవానిచేసిన ఆమాతృదేవతామూర్తిని మరవనా? అంతకృతఘ్నుడనా? వీలులేదు. కాని, పెండ్లికూతును మరవనా? అయితే యిప్పుడీప్రయాణ మెవరికోసం? మామయ్య అన్నివిధాలా వర్ణించింది యెవరిని? సంసారయాత్ర సుఖంగా జరగడానికి తోడునీడగా వుండవలసిన ఆవిడ నేరుకొనేటందుకు పోతూ ఆవిడనే మరవనా? ఇదీ అసంభవమే. ఇద్దరినీ మరువలేను. పోనీండి; బండ్లో మా

ట్లాడుతూ పోదామంటే ఆబండ్లో మరెవ్వరూ లేరు. నేనొక్కణ్ణే! అప్పుడు సెకండ్ క్లాసులో యెందు కెక్కినానా, అంత డబ్బెందుకు కర్చుపెట్టానా? అని నాకు విచారం కలిగింది. కాని, ఆవెంటనే నామనసు "పెండ్లికొడుకును మొదట అత్తగారింటికి వెళ్లే అల్లుడు సెకండ్ క్లాసులోనే ప్రయాణం చేయాలె. ఇందులో నీవు తప్పేమీచేయలేదు" అని జవాబిచ్చింది. ఏదెట్లున్నా ముందుమాట—మాఅమ్మకుకోడలుకావాలె.ఆమెకోర్కె నేను తీర్చక తప్పదు. అందుకని యెన్నికష్టాలైనా పడడానికి మనసు నిబ్బరించుకున్నాను. అప్పుడు నాకు సంతోషమైంది; కాని, ఫస్ట్ క్లాసులో ప్రయాణం చేయక పోయినానా అనిపించింది. మనుష్యుని ఆశకు అంతం లేదు కదా!సరే;అయిందేమో అయిపోయింది. ఇప్పుడు విచారించి లాభంలేదు స్టేషన్ వెంబడి స్టేషన్ వెళ్లిపోతూన్నది. మనసులో విచారం-అమ్మ-యెట్లున్నదో,ఏంచేస్తూన్నదో ఇదే విచారం. బళ్లారిలో టెలిగ్రాం చేరివుంటుంది. వాళ్లేమి చేస్తున్నారో, ఏమనుకుంటారో, నన్నేమి ప్రశ్నలడుగుతారో, ఏయేవిధంగా నేను మాట్లాడాలెనో;మామగారియెదుట-కాబోయే మామగారి యెదుట సుమండీ!—ఎట్లావుండాలెనో,బావమఱఁదు లేయేప్రశ్నలడుగుతారో, ఈలాటివే అనేక విచారాలు నాలో నేను కల్పించుకొంటూన్నాను. అంతలో నాకు కాబోవుభార్యరూపం నా కళ్లయెదుట నిల్చింది. మా కొత్తసంసారం యేయే విధంగా జరగాలెనో, యేమేమి కావాలెనో, మేము భార్యాభర్తలం యేవిధంగా ప్రవర్తించాలెనో అన్నీ ఆలోచించుకుంటూ బండ్లోనే పడుకున్నాను. ఎప్పుడు నిద్ర పట్టిందో పట్టింది. తెల్లవారుగట్ల మెలకువయింది. కిటికీలోనుండి బయటికి తొంగిచూచాను. బెజవాడసమీపిస్తున్నట్టు తెలిసింది. తొందరతొందరగా డ్రెస్సు సవరించుకొని, స్టేషనులో దిగడానికి తయారైనాను. "బెజవాడ బెజవాడా" అని పోర్టరులు కేకలు పెట్టినారు. బండి ప్లాట్ఫారం సమీపించి ఆగింది.

౨

నేను బండిలోనుండి దిగి కూలీని పిలిచి సామాన్లు చూపి "గుంటకల్" అన్నాను.


కూలీ సామాను మోసికొనిపోయి గుంతకల్లు లైనులో ఉన్న బండిలో పెట్టినాడు. నేను దంతధావనం చేసి మాఅమ్మ నాప్రయాణంలో పనికిరావడానికని చేసి యిచ్చిన రొట్టెలు, పూరీలు, లడ్డులు, కొంచెంకొంచెంగా ఫలాహారంచేసి, కాఫీ పుచ్చుకున్నాను. ఫ్లాస్కులో కాఫీ నింపినాను. బండ్లో కూర్చున్నాను. నాకర్మం అక్కడకూడా సెకండ్ క్లాసుకంపార్ట్మెంట్లో యెవరూ లేరు; నేనొక్కణ్ణే. బండి బయలుదేరడానికి రెండునిమిషా లుండగా ఒకకుర్రవాడు 'డెయిలీహెరల్డు' 'టైంస్ ఆఫ్ ఇండియా' 'లండన్ మెయిల్' అని యేదేదో అరుస్తూన్నాడు. నేను డెయిలీఎక్స్ప్రెస్ కొన్నాను. బండి కదిలింది.

బండి చిన్నలైనుకు తిరిగింది. కృష్ణాబ్రిడ్జి దాటాము. ఆహా! ఎంతచక్కగా, ఎంతదిట్టంగా, కట్టారా బ్రిడ్జి! ఈ ఒడ్డునుండి ఆవొడ్డుననుండే కొండమీదికి టెలిగ్రాం తీగవేశారు, మధ్యన ఆధారం లేనిదే. కొండమీదినుండి కొండకు రెండుమైళ్లదూరం! ఆశ్చర్యం! నదీప్రవాహం సొంపుగా వుంది. మెల్లగా తాడేపల్లి చేరినాను. అక్కడ బండ్లో యెక్కేవారుగాని దిగేవారుగాని అట్టే యెక్కువజన ముండలేదు. కాని, బండిమాత్రం చాలాసేపాగింది. అయిందీ. మొదటిబెల్, రెండవబెల్ అయినవి. గార్డు ఓగి లూదాడు. పచ్చజెండా చూపాడు. బండి నడవసాగింది. కాని, ఆనడక యేమిటో చీమలబారైనా కొంచెంనయం; మెల్లగా నడచీ నడచీ మంగళగిరిస్టేషన్ చేరింది. స్టేషన్లో గుంపులుగుంపులుగా జనులు నిలబడివున్నారు. బండ్లోనుండి వూరివేపున చూస్తే కొండమీద పానకాలరాయడు దేవాలయం, క్రిందవుండే శ్రీనరసింహస్వామిదేవాలయగోపురం కనబడినవి. ఇక్కడికి దేవదర్శనానికి యెక్కడెక్కడినుంచీకూడా భక్తులు వస్తూవుంటారు. పుణ్యక్షేత్రం.

నేనూరివైపున దేవాలయాలవైపున చూస్తూన్నకొద్దీ నాకీవూరిలో దిగి పానకాలరాయని సేవించి రావలెనని బుద్ధిపుట్టింది. కాని,ఆవెంటనే 'యిప్పుడు కాదు. బళ్లారినుంచి తిరిగివచ్చేటప్పుడు దిగుదా'మని నిశ్చయించుకొంటూన్నాను. ఇంతలో నేనెక్కిన బండివద్దర యెవరిదో కంఠస్వరం నా చెవులపడ్డది.

"ఇందులో తెల్లదొరున్నాడే!" అని.

నేనా వైపు చూచాను. ఇద్దరాడవాళ్లూ, ఒక కుఱ్ఱవాడు నిలబడివున్నారు. నేనెక్కిన బండ్లో యెక్కాలెనని వారివుద్దేశం. తెల్లదొరున్నాడని నన్ను తెల్లదొర



"ఇందులో తెల్లదొరున్నాడే"

అనుకొన్నారు! అనుమానిస్తూన్నట్లు నాకు తోచింది. అంతలో "ఉంటే నేమి?" అని ఆ స్త్రీలలో చిన్నది అన్నది. వారు ముగ్గురూ బండ్లో యెక్కారు. కూలివాడందిచ్చిన సామాన్లు సర్దుతూ వున్నారు. నేను వారివంక చూస్తున్నాను.

వాళ్లలో పెద్దామెకు సుమారు ఇరవైయైదో, ఇరవై యారో యేండ్లుండును. గులాబీరంగు సన్నని అంచు జరీచీరకట్టుకున్నది. వెండ్రుకలు చక్కగాదువ్వి, ముక్కుకుసూటిగ పాపిటతీసి, బొంబాయిదేశం స్త్రీలవలె ముచ్చటముడి పెట్టింది. మొత్తంమీద చక్కనిమనిషే.

రెండవఆమెకు సుమారు పదారు పదేడేండ్లుంటుంది. ముఖం కొద్దిగకోల; పెద్దపెద్ద కన్నులు; ఆ నేత్రాల్లో ఒకవిధమైనకాంతి చాంచల్యం; పక్కపాపట; ముచ్చట ముడి; తెల్లని, సన్నని జరీచీర; చీరకుచ్చిళ్లు పమిటకొంగూ నేలకు జీరాడుతూన్నవి; సిల్కుజాకెట్టు, మెడలో డాలర్ గొలుసూ, గడియారంగొలుసూ, చేతులకు బంగారు సన్ననిగాజులు, నడుముకు గజ్జెలవడ్డాణం, చెవులకు తెల్లరాళ్లకమ్మలు, (రవ్వలో పుష్యరాగాలో దేదీప్యమానంగా పలువన్నెలు వెలుగుతూన్నది!); ఇంకాయేవేవో వున్నవి. కాని, ఎందుచేతనో కాని నాచూపుఅకారణంగా ఈమె మీదవాలింది. మళ్లీ తిప్పుకొందామన్నా తిరగదు. కారణం యేమైవుంటుందో! ఏమైతే నేమిగాని, మా అమ్మకు ఈలాటిచక్కని కోడలు దొరికితే ఆమె సంతోషిస్తుందనుకున్నాను. కాని, యిదేమి? మంగళసూత్రం లేదు. ఈ బాల వివాహితయా? అవివాహితయా? లేక బాల—ఛీఛీ! నుదుట చక్కని, గుండ్రని, చిన్న కనబడీ కనబడనట్లు నొసళ్లసందున కుంకుం బొట్టున్నది. చేత గాజు లున్నవి! కన్యయే అయితే ఇంత పెద్దయ్యేవరకూ పెండ్లిచేయకుండా వుంచిన తలిదండ్రుల (బ్రాహ్మణులైతే) ధైర్యమే ధైర్యం! నాలో నేను ఆలోచిస్తూ మెచ్చుతూ వున్నాను.

"వదినా, ఫలాహారం పెట్టె యేదీ?" అని గాభరాతో ఆచిన్నది పెద్దామెను అడిగింది.

"బండ్లో మరచారేమో? చూడు మనూవదినా?" అని పెద్దామె వెనకి బాలునితో "మరదీ! పెట్టెలేదు. ఎద్దులబండ్లో వుండి పోయిందేమో?" అన్నది.

బాలుడు–ఇతనికి పందొమ్మిదిరవైయేండ్లుంటుంది– తటాలున రైలులోనుండి దిగి పరుగెత్తినాడు.

"అన్నయ్యా, 'టైం' అవుతుందేమో; వద్దు వద్దు, పోవద్దు" అని చిన్నది కేక పెట్టింది.

ఆ అన్నయ్య యీ చెల్లెలిమాట వినిపించుకొంటేనా? ఒక్కటే పరుగు. స్టేషనుకు బయటపడ్డాడు. రైలరిచింది. గార్డుపచ్చజెండా చూపాడు. బిగి లూదాడు.

చిన్నది అన్నయ్య రాలేదే వదినా? బండి కదిలిందే? ఎట్లా? "అన్నయ్యా, అన్నయ్యా" అని యేడుపు,

మొఖంపెట్టి కళ్లనిండా కడివెడునీళ్లు గక్కుతూ, బండి కిటికీలోతలమార్చి అరుస్తున్నది. పెద్దామె గుటకలు మింగుతూంది; కిటికీలో తలమార్చి చూస్తూంది. ఏం చేయాలె! నేనూ ఆవైపు చూచాను. వారిదుఃఖం నేను చూడలేకపోయాను. బండి ఆపుదామని 'చెయిన్' లాగాను. కాని, యేమిలాభం. బండి ఆగలేదు, అంతలో ఒకకుర్రవాడుచేత ఫలాహారం డబ్బాపట్టుకుని పరుగెత్తుతూ ప్లాట్‌ఫారంచేరాడు. రైలు ప్లాట్‌ఫారం దాటింది. పోలీసువాడొకడా కుర్రవాణ్ణి పట్టి స్టేషనులో ఆపేశాడు. లేకపోతే ఆకుర్రవాడు యేలాగో ఒకబండ్లో యెక్కివుండేవాడే. కాని, యిప్పుడు మంగళగిరిలో దిగబడిపోయినాడు.

అప్పటి వారి దుఃఖానికి మేరలేకపోయింది. ఇద్దరి కళ్లలోనూ గంగా యమునానదులు ఒక్కసారిగాపొంగి పొర్లిపోతూన్నట్లున్నవి. ఇద్దరికీ నోటమాట రాలేదు. ఇద్దరూ కిటికీలగుండా చూస్తూనేవున్నారు. నాచూపు ఆచిన్నదానిమీదనుంచి కదలదు. అందులోను ఆప్రాతః కిరణాలతాకుడుచేత ఆమె ముక్కున, చెవులలో వున్న వస్తువులలోని తెల్లరాళ్లు మరింత ప్రకాశించి ఆవిడ కట్టుకొన్న తెల్లనిచీరమీద ప్రతిఫలించి నానావర్ణాలు కనబడడంచేత-వంగి కిటికీగుండా చూస్తూవున్నది - అది మనుష్యవిగ్రహమా లేక, ఇంద్రధనుస్సా, అని దూరంలో నుంచి చూచేవారికి అనుమానం కలగడంలో ఆశ్చర్యమేమీలేదు. అప్పటి ఆచక్కదనం వర్ణించడానికి నేను కవీశ్వరుణ్ణి కాకపోయినాను. చిత్తరువు వ్రాయడానికీ చేతకాదు, ఏంచేయను? ఎంతచెప్పితేమాత్ర మేమిలాభం? నామనస్సుకే తెలుసును! నాకండ్లకే తెలుసును! ఏదెట్లున్నా కన్ను లున్నందుకు చూడదగినవస్తువునే చూచాను. కాని, యెంతచూచినా తనివితీరదు. ఎంతబలవంతంగా లాగికొన్నా నాచూపు కదలదు.

అప్పటివారిస్థితి యెట్లుండాలెనో తెలపడంకంటె వూహించుకోవడమే మంచిది. నాకు మహాజాలి కలిగింది. వారికి కావలసిన సహాయం చేయడానికి నేను సంకల్పించుకున్నాను. 'భయపడవద్దు. మీఅన్నయ్యకు వచ్చినభయం ఏమీలేదు. మీకు తోడు నేనున్నా'నని అని వాళను ఓదార్చామని అనుకున్నాను. కాని, వాళ్లేమనుకుంటారో, ఏమో! అని అధైర్యం. ఛీఛీ! మనలో వున్నచిక్కు లివే! ఎంత దీనావస్థలో వున్నప్పటికిని, పరస్పరసహాయం ఆవశ్యకమైనప్పటికిన్నీ ఒక్కపురుషుడు ఒకస్త్రీతో మాట్లాడడం మన హిందూఆచారాలకు వ్యతిరేకం! ఎంతకాఠిన్యం? ఎంతనిర్దయా? నేనెంతయూరోపియన్ డ్రెస్సులో వున్నా నాది హిందూహృదయమే కదా! ఈలాటిశంకలకు తావిచ్చి కొంచెంసేపాలోచించుకున్నాను. అప్పటికిని, పాపం! వాళ్లను మర్యాదకైనా, పైఉపచారానికైనా, "దిగులుపడవద్దు" అని నేను అనలేకపోయినాను. హిందూహృదయం లోపల, పైన ఇంగ్లీషుడ్రెస్సు! నాపాట్లు భగవంతుడికే తెలియాలె. అట్లాగే నంబూరు చేరాము. బండ్లో వాళ్లిద్దరిసంభాషణలూ విన్నాను. అంతవరకూ వారిమాటలు నాకు వినబడలేదు. రైలిప్పు డాగడంచేత వినబడ్డవి.

"వదినా, నాకొకఆలోచన తోస్తూన్నది." అని చిన్నది వాక్యం పూర్తిచేయకముందే, పెద్దామె ఆత్రంతో 'ఏమది? చెప్పు మానూవదినా!' అన్నది.

"ఈస్టేషన్‌లోది1 బెజవాడలో పెద్దన్నయ్యకొకటీ, బళ్లారిలో నాన్నకొకటీ టెలిగ్రా మిచ్చి, తిరిగీ వచ్చేబండ్లో చిన్నన్నయ్యవస్తే అంతా కలిసిపోవచ్చునేమో" అని అన్నది చిన్నది.

"అవును; అది బాగానే వున్నది; కాని, యిన్ని సామాన్లు దింపుకోవాలె, మళ్లీ వచ్చేబండి పన్నెండుగంటలకుగాని రాదు. అంతవరకూ—"

"అవును. అదీ నిజమే. కాని, మంగళగిరిలో చిన్నన్నయ్యకు "పోతూంటాము; నీవు దిగులుపడవద్దు. వచ్చేబండ్లో రావలసిం" దని టెలిగ్రామిస్తే?"

"ఇచ్చేవారెవరు?" అన్నది వదిన.

"నేను" అని అందామని నా నాలుక చివరకూ మాట వచ్చింది కాని, యింతవరకూ పరామర్శించకుండా వుండి, యిప్పుడు వారు నన్ను పలకరించందే నేనై జోక్యం కలిగించుకుంటే వారేమిగాభావిస్తారో అని భయంవేసి ఆమాట అణచుకున్నాను. కాని, వారికి కావలసిన సహాయం చేయడానికి ఆదుర్దాగానే వున్నది నాకు. నాకుకావలసిందంతా ఒకటే; వాళ్లఆజ్ఞ! ఏమాజ్ఞాపిస్తే అది చేస్తానని నాలో నేను నిశ్చయించుకుంటున్నాను.

కేదో సంబంధముండాలె! కాకుంటే ఈలాటి భయంకర సంకటసమయంలో మిమ్మల్నే మాకు సహాయం చేయడానికి పరమేశ్వరు డెందుకంపివుంటాడు?" అన్నది.

నాకు పట్టరానినవ్వు వచ్చింది. ఏం చేయను? క్షణకాలం కండ్లు మూసుకుని నాలోనే నవ్వుకున్నాను పూర్వజన్మంమాట యేమో కాని ఈజన్మ సంబంధమే అంటే బాగెంటుంది అని అనుకున్నాను అనంతరం నే నాబాలికనుచూచి,

"నాకూ నట్లే తోస్తూన్నది" అని అన్నాను.

"అట్లయితే మమ్మ మరవ్వద్దు సుమండీ!" అని అన్నది వదిన.

"ఔను, మమ్మ ల్నెప్పుడూ మరవకండీ!" అన్నది బాలిక.

నేనూ "మీరు న న్నెప్పటికీ మరవరని తలుస్తాను" అని అన్నాను.

మనోహరి చిరునవ్వు నవ్వి—ఆహా! ఆచిరునవ్వు!—

"మీరు మనదేశపువారని మా కేమాత్రమూ తోచడంలేదు. మీరు మనఆంధ్రులే అయివున్నట్టయితే—" అంటూవుండగా.

"ఆఁ!ఆంధ్రుణ్ణైవుంటే?"అనిప్రశ్నా పూర్వకంగా అడిగాను. నాహృదయం బహుతీవ్రంగా, బహువేగంగా, కొట్టుకోసాగింది.

అంతలో 'వదిన' మొహ మావలకు తిప్పుకొని, 'మనూవదిన' తొడను మెల్లగ గిచ్చి, పరిహాసంగా నాకు వినబడకూడదని—ఎట్లాగూ నాకు వినబడ్డది—నాకు తెనుగు రాదుకదా అనుకొని—"ఆంధ్రులైవుంటే నన్ను సమర్పించుకుందునుగదా! అనేకాదూ, మనూవదినా, మీ వుద్దేశం?" అని అన్నది.

అప్పుడు మాత్రం మనోహరి నిజంగా మా మనోహరంగాకనబడ్డది. బుగ్గలకు గులాబీరం గెక్కింది. క్షణంలో మొహమంతా యెర్రబడ్డది. సిగ్గు చేత! కాని, కోపం నటించి అరువుతెచ్చుకొని "వదినా, వదినా, యేమంటివి? ఈయనకు తెనుగువస్తే—" అన్నది.

"ప్రమాద మేమైంది? వస్తే" రానీ. ఏ మ్మనిగింది అన్నది వదిన నవ్వుతూ "ఈను జోడూ—"

"చాలించువదినా, యింకనైనా! పాండిత్యం ముదురుతూన్నది. ఎవరైనా వింటే—"

"సంతోషమే కాని తెలుగు విశ్వవిద్యాలయ

"ఇంక చాలించువదినా!" అన్నది మనోహరి. గ్రంథాలయము

ఇంతవరకూ నేను గంభీరభావం వహించి కూర్చున్నాను. వరుస సంఖ్య..2097..వ..

"మరూ వదినా,నీవేమన్నా సరే,ఈతడు మనదేశం, వాడే, మనవాడే, అని నా అ చెప్పుతూన్నది. అదుగో ఎంతదాచినా దాగని, ఆ హిందూకళ, అందుపై బ్రాహ్మణకళ, ఆకండ్లు! అయితే హైద్రాబాదీ కానవచ్చును గాక!" అనిఅన్నది వదిన!

నాకా నవ్వువస్తున్నది. ఏంచేయను? దగ్గరున్న "స్ట్రాండ్ మాగజైన్" పుటతెరచిమొహానికడ్డంపెట్టుకొని చేతిరుమాలుతో మొహం తుడుచుకోసాగాను. నావుద్దేశ మేమిటి? నవ్వు ఆపుకోవడానికే. కొంచెంగానైనా పైకు ఒకితే రుమాలామరుగున వుండిపోవడానికే!

కొంచెం కృత్రిమకోపంతో 'మనూవదిన' "వదినా, వదినా—" అని యేమో అనబోయేసరికి—

'వదిన' "మనూవదినా, మన కింతవరకూ తోచకపోయిందికదా! మనల్ని కనిపెట్టివుండి యింతసహాయం చేస్తూన్న యీపెద్దమనిషి వూరేదో పేరేదో కనుక్కోలేదుకదా!" అని యింకా నేమో అనబోయేసరికి.

'మనూవదిన', తలవంచి చిరునవ్వుతో "ఎందుకోనే వదినా, నే నడగలేకున్నాను! నీవే అడుగు" అన్నది.

"అమ్మయ్యో, ఇప్పుడు ఊడిపడ్డదే సిగ్గెక్కడనుంచో! ఈయనవిషయం మనం తెలిసికోకపోతే యేం బాగుంటుంది? పోనీ రేపు మామగారైనా యేమంటారు? 'అంతగా మీకు సహాయంచేసిన పెద్దమనిషి వూరూ పేరూ కూడా అడక్కపోయినారే' అని మనల్ని దూషించరా? అదీ పోనీ మరొక్కవిశేషం—"

"ఏమది?" అన్నది 'మనూవదిన.'

ఇంతవరకూ వాళ్లకు నావూరూ పేరూ కులం తెలీలేదు. ఇప్పుడూ వీరు నన్ను అడగడం నిశ్చయం అనుకున్నాను. ఉన్నది వున్నట్టు నిజం చెప్పివేదా మనుకున్నాను. ఇంతలో నానిశ్చయం మారిపోయింది. యతి అని అనుకుని అన్నాళ్లూ నిష్కపటంగా సేవలుచేస్తూ, ప్రవర్తిస్తూ, సరళంగా, ధారాళంగా, బహిరంగంగా, అర్జునుడిమీది తన గాఢానురాగం, దృఢప్రేమా వెల్లడించి, యతే అర్జునుడని తెలిసినంతట సిగ్గు చుట్టుకోగా త్వరున

పొయ్యిపోయిన సుభద్ర నాకు జ్ఞప్తికివచ్చింది. నేను నిజం చెప్పితే అదేమాదిరి అవుతుందేమో! ఎంత చదువుకొన్నా, ఎరకటిసంఘసంస్కర్తల పిల్లైనా, యింత పదిమందిలో కలిసిమెలసివున్నా హిందూబాలికే కాదా! నిజం తెలిస్తే. నాతో మాట్లాడదేమో! కలిసిమెలసి వుండదేమో! ఛీ! నిజం చెప్పకూడదనుకున్నాను. ఈవిధంగా మనసులో నిశ్చయించుకుంటూ వున్నాను. యింతలో 'మనూవదిన' సాహసంచేసి ఒకజిత్తు పన్నింది. నాపక్కన ఆంగ్లనవల ఒకటి పడివున్నది. తటాలున దాన్నెత్తుకుని మొదటి పుట చూచింది. అందులో వున్న పేరు నాదికాదు; నా స్నేహితురాలిది. కాని, హింగూ పేరు చదువుకున్నది. పుస్తకం అట్లే వుంచేసింది.

వదినతో నేమో గుసగుసలాడింది. నాకు బాగా వినబడలేదు.

"అట్లైతే, మనూవదినా! ఆయన ఈతనికి తెలుసునేమో అడిగి——" అని వదిన యేమో అనబోయింది.

మనూవదిన కృత్రిమకోపంతో అదికోపమో సిగ్గో నాకు తెలీలేదు. "నే నడగను నాకవసరంపట్టలేదు" అన్నది.

"ఎందుకట్లా? మరొక్కరు దొరకబట్టేనా నీ కవసరంలేదు?" అని వదిన నవ్వింది.

"ఇదుగో వదినా! యిటుచూడు."

"ఆఁ, ఆఁ ఇప్పుడు చూచే దేమిటి? మంగళగిరి కాదు, గుంటూరుస్టేషనులో నుంచీ చూస్తూన్నాను. ఈడూ జోడూ కుదిరింది. సంతోషిస్తూన్నాను" అన్నది 'వదిన.'

"అబ్బబ్బబ్బా! వదినా, సదా సర్వదా పరిహాసాలే!" అని 'మనూవదిన' అంటూవున్నది. రైలు దొనకొండ స్టేషనులో ఆగింది. నేను దిగి పెట్టెగా మాయ పోయినాను.

౫

"రేపుదయం తొమ్మిదిగంటలకు బల్లారి చేరుతున్నాము. మా కేలాటి ఆయాసంకూడా కలగలేదు. సుఖంగా ప్రయాణంచేస్తూన్నాము. దిగులుపడవలదు.——మనోహరి."

అని నేను నాకాబోవుమామగారికి టెలిగ్రాము యిచ్చి, వచ్చి బండియెక్కాను. వదినా ఆడబిడ్డలు యేమో మాట్లాడుకుంటూ నవ్వుతూ వున్నారు. నన్నుచూచి మాట లాపేశారు. వాళ్లకు అనుమానం తగిలిందేమో! నా మనసూ పరిపరివిధాలా ఆలోచనలో దిగింది. అది దాచడానికని దగ్గరున్న నవల తీసికుని చదువుతూన్నవానివలె నటించాను. రైలు కదిలింది.

'మనూవదిన' యేదో జ్ఞాపకం చేసుకున్నట్టు వున్నట్టుండి తటాలునలేచి బల్లకిందవున్న ఒక చిన్న బుట్టలోనుంచి కొన్ని అరటిపండ్లు, అయిదారుబత్తాయి నారింజ, సీమరేగుపండ్లు తీసి నన్నుచూచి చిరునవ్వుతో ఆదరంతో "మీ కాకలి వేస్తుంద లేదా?" అన్నది.

నిజంగానే నాకప్పుడు భలే ఆకలి వేస్తూంది. లేదంటే వాళ్లకు కోపం వస్తుందేమో. ఔనంటే యేమనుకుంటారో! ఎట్లాగైనా సరే అని ధైర్యంచేసుకుని నేనూ నవ్వుతూనే "ఆఁ; ఔను మరిచానుసుడీ!" అనిలేచి సరిగా కూర్చున్నాను.

మనోహరి పెట్టెలోనుంచి ఒక వెండిపళ్లెం తీసి నారింజకాయలు, బత్తాయిలు ఒలిచి బద్దలు అరటిపండ్లు తోలువొలిచి ఆపళ్లెంలో పెట్టి నాముందుపెట్టింది. వాటినన్నిటిని నిమిషంలో ఫలహారం చేశాను. ఆకలితీరలేదు. మాఅమ్మ నాకోసమని యిచ్చినపూరీలు లడ్డూలు తీదామనుకున్నాను. కాని, అవివారికి పనికివస్తుందో కాదో అని అనుమానం కలిగింది. కాబట్టి ఆమాటే యెత్తలేదు నేను.

నాపళ్లెం ఖాళీకావడంచూచి మనోహరి "పంపనపనస ఒలిచి యివ్వనా? ఇంక రెండుఅరటిపండ్లివ్వనా?" అన్నది.

"సరేగాని, అన్నీ నేనే తినేస్తే మీకేమైనా కావలెనా లేదా?" అని నే నన్నాను.

"ఉన్నవి లెండి. చాలకపోతే వచ్చే స్టేషనులో మరేమైన కొనవచ్చును" అన్నది వదిన!

'వదిన' వాక్యం పూర్తి కాలేదు. అంతలోనే 'మనూవదిన' నాదగ్గర వున్నపళ్లెంలో బత్తాయిబద్దలూ రెండు ద్రాక్షగుత్తిముక్కలూ పడవేసింది. నేను 'ఆఁ—ఆఁ' అంటూనే వున్నాను. కాని, యేమిలాభం? మానిందా? పైగా చిరునవ్వు నవ్వుతూన్నది.

అప్పుడు 'వదిన' నవ్వుతూ అర్ధరహస్యంగా "మనూవదినా, అన్నీ ఆయనకే యిస్తే మన కేమీ అక్కరలేదా? నాకుమాత్రం ఫలదానం చేయవూ?" అన్నది.

"నీకు లేనిదేనా వదినా? ఇదుగో తీసుకో!" అని మనూ ఆమెకుకూడా యిచ్చింది.

ఈవిధంగా సరసాలతోటి, పరిహాసాలతోటి, సంతోషంతోటి, ముచ్చట్లతోటి, మహానందంతో ప్రయాణం చేస్తూన్నాము. స్టేషను వెంబడి స్టేషను వెళ్లిపోతున్నది. సుమారు మూడు మూడున్నరకు కంభం స్టేషను చేరాము. అక్కడ స్టేషనులో 'టీ' మాత్రమే దొరుకుతుంది. 'రెఫ్రెష్‌మెంట్ రూంలో' ఆ టీ మావాళ్లకు—కాదు—నాతోటి ప్రయాణం చేస్తూవున్న స్త్రీలకు—పనికివచ్చునో రాదో అనుకుని పట్టిపాలుమాత్రం తెప్పించినాను.

క్రమక్రమంగా స్టేషనులు వెళ్లిపోయినవి. చెలమ దగ్గర బండి యెక్కువసేపు నిలబడ్డది. బయలుదేరి కనమ లెక్కసాగింది. ఆహా! ఆకనమ లెక్కుతూవున్నప్పుడు బండి నడవడం, వర్ణించడం దుస్సాధ్యం. అయినా మనకు వర్ణనలతో పనిలేదు. పామువలె మెలికలు మెలికలుగా బండిపోతూవుండడం; అప్పటియెండ తూర్పుకుడివేపున—వెంబడియెడమవేపున; అరక్షణంలో అసలే బండ్లోయెండలేకపోవడం; ఆపర్వతాలూ, ఆఅరణ్యాలూ, ఆకొండచరియలూ, ఆ అఖాతమూ, ఆచెట్లూ, ఆగుహలూ, ఆదొనలూ, ఆ వంతెనలూ, ఆసృష్టిసౌందర్యమూ, ఆ కృత్రిమసృష్టిసౌందర్యమూ, చూచి మనకు యెట్లెట్లో అయిపోయింది! ఇవి చూస్తే, నిజంగా నాస్తికుడికైనా దైవమహిమ తలపునకు రాకపోదు. అందులో నొక్క గమ్మత్తు. పర్వతం తొలిచి గుహగా చేశారు. అందులోనుంచే రైలుపోతుంది. పైనకొండ, క్రిందకొండ, కుడీయెడమలా కొండా, వెనకాకొండా; ముందూకొండా! ఆగుహలో రైలు ప్రవేశించేటప్పటికి బండ్లోవాండ్లందరూ 'గోవిందం' కొట్టసాగించారు, హరినామం సాగించారు.

ఎట్లాగైతేనేమి, మేము ఆనంద ప్రఫుల్ల హృదయంతో రాత్రి ఎనిమిదిన్నర తొమ్మిదిని కొట్టేసరికి నంద్యాల చేరాము. అప్పుడు మాకు ఆకలిఅన్న సంగతి తెలిసింది. అంతవరకూ దేవుని విచిత్రసృష్టిచిత్రాన్నే తలచుకుంటూ అందులోనే లీనమైపోయివుంటిని. నా కాకలి కాలేదు; కాని, నాతోడివారిగతియేమి? ఇప్పుడుచాలా గొప్పచిక్కులో తగులుకున్నాను.—భోజనం తెప్పిద్దామా? నేను ఆంగ్లేయుణ్ణి అని వీళ్లనుకున్నారు. నన్నూ భోంచేయమంటారు. నాకీభోజనం సరిపడ దనుకుంటారు. నేను భోజనం చెయ్యందే వీళ్లు చెయ్యరు. నేనుతిన్నానా, నాగుట్టు బట్టబయ లవుతుందేమో! తినకపోయినానా, వీళ్లూ తినరు. ఒకవేళతిన్నా నాయెదుట తింటారో లేదో? ఏం చేయాలె? ఈచిక్కులోనుంచి తప్పించుకొనే మార్గమేదీ; ఆలోచించాను; ఆఖరుకు భోజనంమాటే తలపెట్టకూడదని నిశ్చయించాను. బండ్లోనుంచి దిగాను. కొన్ని మిఠాయిదినుసులూ, కొన్నిపండ్లూ, ఫలాలు కొనుక్కొని వచ్చి రైలెక్కాను. అన్నీ వాళ్లముందు పెట్టాను. అప్పుడు నాకొక ఆలోచనతోచి నవ్వు వచ్చింది. నవ్వుకున్నాను. ఈచిక్కులన్నీ, ఈబాధలన్నీ నాకెందుకా అనుకున్నాను. సంసారతాపత్రయం యిప్పుడే ప్రారంభమైనందుకే నాకు నవ్వువచ్చింది. అందుకే అంతలో రైలు నడవసాగింది. 'మనూవదిన,' నన్ను చూచి మీకు మామూలాన చాలాశ్రమ కలుగుతూవున్నది. మీరు బండి దిగివెళ్లితే ఎక్కడికో అనుకొన్నాను. ఇందుకని తెలిసివుంటే అక్కరలేదని చెప్పియుందును" అని అన్నది.

నేను "నాకు శ్రమాలేదు. మరేమీ లేదు. మీరు అక్కరలేదంటారనే మిమ్మల్ని నే నడగలేదు. అయినా ఇవన్నీ మీకోసమనే తేలేదు. నాకోసం తెచ్చుకొన్నాను. అయితే యింతఎందుకు అంటారేమో? నాకు చెడ్డ ఆకలి వేస్తున్నది. నేనుమాత్రమే అన్నీ తినడం నాకు న్యాయం కాదు. నీతీ కాదు. మీరు కొంచంగానైనా పుచ్చుకోవాలె అని తెచ్చాను. ఇందులో మూడువంతులు నాకే యిచ్చివేసి వక్కవంతు మీరు పుచ్చుకుంటారని ఈ మధ్యాహ్నం అనుభవంవల్ల నాకు బాగా తెలుసును" అని నవ్వినాను.

అందరము నవ్వినాము.

ఫలహారానంతరము మూగ్గురం మూడుబల్లలమీద పడుకొని నిద్రించాము.

స్త్రీలిద్దఱు త్వరలోనే నిద్రించారు. నాకు నిద్ర పట్టలేదు. ఈబాలికనుగూర్చి మామయ్య రాసిన వర్ణనల్ని

ఈపిల్లే తనకు కోడలుకావలెనని మా అమ్మ పట్టుదలా, ఈ బాలిక రూపలావణ్యాలు, వినయ విధేయతలు, విద్యా బుద్ధులు మొదలగువిషయములు నామనస్సులో పూర్తిగా నిండిపోయింది. నాభవిష్యత్ సంసారసుఖము నాకలలో కనిపించింది. ఈపిల్లనే మాఅమ్మకు కోడలుగా జేయడానికి నిశ్చయించాను.

ఎట్లాగో తెల్లవారేసరికి గుంతకల్లు చేరాము.

## ౬

గుంతకల్లుస్టేషనులో నేను దిగి వీళ్లకు ముఖమార్జనానికి నీళ్లు తెప్పించియిచ్చాను. తరువాత కాఫీ, రవ అట్లు, బంగాళాదుంపహుర, బేసర్‌లడ్డూ, రవలడ్డూ, మొదలైనవి తెప్పించి ఫలాహారం అయింది ఎనిమిది గంటలకే బండిసాగింది.

గుంతకల్లుకు బళ్లారికీ మధ్య నాలుగుస్టేషనులు దాటి బళ్లారి ప్లాట్‌ఫారం సమీపిస్తూ వున్నాము.

మనోహరి కిటికీలోనుంచే ప్లాట్‌ఫారంపై చూస్తూ, "అదుగో అన్నయ్య" అన్నది.

నేనూ వదినా చూచాము. స్టేషన్లో జనం కిటకిటలాడుతూ వున్నది. అందులో ఆఅన్నయ్య ఎవరో నాకు తెలియలేదు. నేను హ్యాటూ బూటూ తగిలించుకొని బండి దిగడానికి తయారైనాను. అంతలో బండి ప్లాట్‌ఫారంలో ఆగింది.

ఇరవయిరెండుఏండ్లయువకుడు ఒకడు మాపెట్టె దగ్గర చిరునవ్వుతో నిలబడి కూలీని పిలిచి, బండ్లో సామాన్లు కిందికి దింపించాడు.

ఆయువకుడు మనోహారికి రెండవఅన్నయ్య. చెల్లెలేదో అతనికి చెప్పింది. ఆ య న ద గ్గ రి కి వచ్చి నాకేదో ఉపచారం చేయ ప్రారంభించాడు. నేను తగినట్టుగానే బదులు చెప్పినాను. అంతే అందరము కలిసి స్టేషన్ బయటికి వచ్చాము. వాళ్లసామాన్లు ఒకగుఱ్ఱపు బండ్లో పెట్టారు. నేనూ వాళ్లకు కొంచం దూరంలో బండికుదుర్చుకుంటూ వున్నాను. అంతలో మనోహరి అన్నయ్య, తొందరతొందరగా నడిచివచ్చి నా చెయ్యి పట్టుకొని "మీరు బండి కుదుర్చుకుంటూ ఉన్నారు. ఎక్కడికి వెళుతున్నారు? మాతో కూడా మాయింటికి రారా? అన్నాడు.

నేను వెనక్కి తిరిగి చూచాను. మనోహరి ఆమె వదిన, యిద్దరు ఒక్క మోటారు దగ్గిర నిలబడి ఉన్నారు. మనోహరి దైన్యంతో నావైపు చూస్తూవున్నది. ఆమె ముఖములో నానాభావాలు కనబడుతూవున్నవి. నేను మాడలేకపోయినాను. వాళ్లతోనే కలిసిపోదాం అనుకొన్నాను. కాని క్షణంలోమనస్సు మారింది. అప్పుడు నేను ఆ యువకునితో "నేనిప్పుడు రాను. నామిత్రుడు నాకోసం ఎదురుచూస్తూంటాడు. చాలా అవసరమైనపని వున్నది. రేపోమాపో తప్పకవస్తాను ఇప్పటికి క్షమించండి" అని అన్నాను.

"మానాన్నగారు మిమ్మల్ని తప్పకుండా తీసుకొని రమ్మని ఆజ్ఞాపించారు. ఆయనకు ఆశాభంగం చేస్తారా. ఆయనే వచ్చివున్నట్టయితే బాగావుండేది. కాని మాయీ అమ్మాయిని చూడడానికి ఒకరు యీ సాయంత్రం వస్తారు. అందుకని ఏదోయేర్పాట్లు చేయడానికి యింట్లోనే వుండవలసివచ్చి నన్ను స్టేషనుకు పంపారు. మా వదినెను మాచెల్లెల్ని సురక్షితంగా తెచ్చినందుకు మానాన్నగారు తమ కృతజ్ఞతను తెలపడానికి మిమ్మల్ని తప్పకుండా వెంటబెట్టుకొని రావలసిందన్నారు." అని ఆయువకుడు బహుదీనంగా, ఆశాభంగమైనందుకు గుస్తూ అన్నాడు.

"ఇప్పటికి నన్ను క్షమించండి. తప్పకుండా సాయంత్రం మీయింటికి వచ్చి మీనాన్నగారిదర్శనం చేస్తాను అని మీనాన్నగారితో చెప్పవలసినది. అవసరమైన పనివుండి యిప్పటికి యిప్పుడే నామిత్రుణ్ణి నేను కలుసుకోవాలె" అని అంటూవున్నాను. ఇంతలో ఆబాలిక మాదగ్గరికి వచ్చింది.

"అన్నయ్యా! మీరు రావడంలేదంటున్నారా? రాకపోతే నాన్నగారికి నీమీదా, నామీదా కోపం రాదా? ఆయనకు ఆశాభంగంకాదా?" అని అతిదైన్యంతో, కళ్లలో బాష్పాలు కురుస్తూ ఉండగా జాలిపుట్టేటట్టు పలికింది.


అందుకు నేను "మీరు బుద్ధిమంతులు, దీర్ఘాలోచన కలవారు. ఇంత పట్టుపట్టడం నాకు విచారంగా వున్నది. ఇప్పటికి నాకు సెలవిస్తే నాపని చూచుకొని తప్పకుండా సాయంత్రం అయిదుగంటలకు మీయింటికి వచ్చివత్తును.

విచారపడవద్దు; ఆలోచించవద్దు; అన్యథా భావించవద్దు. మిమ్మల్ని, మీసహవాసాన్ని యిప్పటికి వేరేచేసి పోవలసి వచ్చినందుకు నాకూ విచారంగానే వున్నది. అంతదూరం నుంచి కలిసివచ్చినందుకు మిమ్మల్ని మీవాళ్లకు అప్ప చెప్పవలసినది నాకు విధి. నేను మీయింటికే రావల సింది అని నాకు తెలుసును. కాని కార్యభారంవల్ల మిమ్మల్ని మీనాన్నగారికి వప్పచెప్పడానికిమారుగా మీ అన్నకు ఒప్పగించాను. కొంతవరకు నావిధి తీర్చుకొన్నా ను. కాని మీనాన్నగారిని దర్శించేవరకు 'నిన్ను వారికి నాచేతిమీదుగా అప్పచెప్పేవరకు,నావిధి పూర్తిగా నెర వేరదు. కాబట్టి తప్పక వస్తాను" అని అన్నాను.

"మీ రింతపట్టుపట్టితే నేనేమిచేయగలను?" అంటూ మనోహరి కండ్లు తుడుచుకొన్నది. కాలి బొటనవ్రేలుతో నేలమీద నేమో వ్రాస్తూవున్నది. ఆవ్రాతయేమో కండ్లు చూస్తూవున్నవి క్షణం గడిచింది; ఆమె వగల తల పై కెత్తి పెదవులపై చిరునవ్వు మొలకెత్తగా "తప్పకుండా వస్తారా సాయంత్రమే? ఎన్నిగంటలకు?" అన్నది.

తప్పక సాయంత్రమే అయిదుగంటలకుఅన్నాను.

"మీరిప్పుడు ఎవరియింటికి పోతూవున్నారు. మీ రింటికి రాకపోతే సాయంత్రం నేను మీస్నేహితుని యిం



"తప్పకుండావస్తారా సాయంత్రమే? ఎన్నిగంటలకు ?"

టికివచ్చి మిమ్మల్ని తీసుకపోతాను." అని అన్నాడు అన్నయ్య.

అడుగుతారని నాకు ముందుగానే తెలుసును. దానికి జబాబుకూడా ఆలోచించేవున్నాను.

"సత్యనారాయణపేటకు కృష్ణరావుగారి యింటి కి" అని చెప్పినాను. కాని యిది నిజం కాదు.

"మీపేరూ?" అన్నాడు యువకుడు.

మారుపేరు చెప్పినాను. వ్రాసుకున్నాడు. మనో హరి మాటిమాటికి "తప్పక రావాలె—రావాలె" అని చెప్పుతూ, వెనక్కి తిరిగీతిరిగీ చూస్తూ, మెల్లగా పోయి మోటారెక్కింది; అప్పటి ఆమనోహరమూర్తిని చూసి కాళిదాసుని శకుంతల తోటలో దుష్యంతుణ్ణి విడిచి పోవడం జ్ఞప్తికి వచ్చింది. మోటారు వెళ్లిపోయింది. నా మనస్సు ఆమోటారులోనే వెళ్లిపోయింది నిమిషంలో నాకు కనబడకపోయింది.

ఒక్కనిట్టూర్పు విడిచి నేను బండియెక్కి 'బ్రూస్ పేట'లోని ఒకహోటలుకు వెళ్లాను. అక్కడే బసచేశా ను. స్నానంచేసి భోజనంచేశాను. నాలుగు ఎప్పుడుకొడ తారా అని గంటలు లెక్కపెట్టుతూ వున్నాను. ఈ లోపుగా నేను కాబోయే మామగారియింటికి వెళితే అక్కడి వాళ్లు ఏమేమి అడుగుతారా? ఏమి జబాబు చెప్పవలెను. అక్కడివాళ్లందరు ఎట్లావుంటారా, నన్ను చూచి ఏమనుకుంటారా, అని—యింకా ఏవేవో అనుకొం టూ వున్నాను. అందరి కంటె ముఖ్యంగా మనో హరి నన్ను గురించి ఏమనుకొంటుందో,ఏమం టుందో, నాకు అర్ధాంగి కావడానికి వప్పుకొం టుందో లేదో, అని నా మనస్సు నానావిధాల త ర్కవితర్కాల్లో మును గింది. కానినాకొక్కటే ధైర్యం. పిల్లనన్ను మెచ్చు కొంది; రోజున్నర తోడుగావుంది.

ఆచూపులు, ఆవగలు, ఆవయ్యారం, ఆసిగ్గు, ఆ చిరునవ్వు, యివన్నిచూస్తే అంగీకార సూచనలే. మా

మామయ్య చేసిన వర్ణనలను మొదట వెక్కిరించాను. ఇప్పుడు ప్రత్యక్షంలో చూస్తే అన్నివర్ణనలు అక్షరాల సరిపోతున్నవి. ఇంకా చూడపోతే వర్ణించడం ఆయనకు చేతకాదన్నమాటే. ఇంకా ఎక్కువగా వుండవలసింది. కాబట్టి మాఅమ్మ తనకు యీపిల్లే కోడలుకావలెనని పట్టుపట్టడం న్యాయమే అని నే నాలోచిస్తూ ఉండగా నాలుగు కొట్టారు. అంతట నా ఆలోచనాసూత్రం తెగింది. నేను లేచి కాళ్లుచేతులు కడుక్కొని ఇంత అల్పాహారం పుచ్చుకొన్నాను. గదిలోకిపోయి పెట్టి తెరిచి బొంబాయిఅంచుధోవతి మడతదీసి విప్పి పంచకచ్చవేసి కట్టుకొన్నాను. ఫ్లానల్ షర్టు వేసుకొన్నాను. సన్నని జరీఅంచు వుత్తరీయం పైకి వేసుకొన్నాను. కాళ్లకు చెప్పులు తొడిగాను. తలపక్కపాపిట తీసి దువ్వుకొన్నాను. నొష్ట కనబడీ కనబడక బొట్టు పెట్టాను. ఈ విధంగా అచ్చంగా బ్రాహ్మణ్ణై మాఅత్తగారింటికి బయలుదేరాను.

వాకిట మనోహరి అన్నయ్య, ఉన్నాడు. నాకోసమే ననుకున్నాను. మేడమీద మనోహరి ముస్తాబైతనవదినతో ముచ్చటలాడుతూ నిలబడిఉన్నది. నాకోసమే అనుకున్నాను.

నన్ను తగురీతిగా మర్యాద చేశారు. మనోహరినాన్నగారు నన్ను చూచి చాలా ఆనందించాడు. ఇంట్లోవాళ్లకు 'అల్లుడుగారు' వచ్చారని కబురంపాడు. అందరూవచ్చి నన్ను చూచారు. ఏమేమో ప్రశ్నలు వేశారు. మెచ్చుకున్నారు. కాని, మనోహరిమాత్రం రాలేదు.

ఆమె నాన్నగారు నాతో మాట్లాడి ఉన్నట్టుండి యేమో జ్ఞాపకంచేసుకుని "అమ్మా, మనోహరి" అని పిలిచాడు. మనోహరి వచ్చి తలవాల్చి నిలిచింది. "అల్లుడుగారికి నీచేతిమీదుగా "టీ చేసి తెచ్చిపెట్టూ" అన్నాడు. వెళ్లిపోయింది. నా వంకకు తిరిగికూడా చూడలేదు. ఏదోపనిమీద మామగారు బయటికి వెళ్లిపోయినారు.

పావుగంటలో ఫలాహారాలపళ్లెం, టీకప్పు తీసుకుని మనోహరి గదిలోకి వచ్చింది. నాన్నగారు లేరు. కలవంచే వున్నది. నాకు నవ్వు కడుపుబ్బుతూ వున్నది. అణచుకున్నాను. ఎట్లాగో 'మనూ—' అన్నాను.

ఆవిడ తలపైకెత్తి ఆశ్చర్యంతో నన్నుచూచింది. నిమిషం చూచింది! ఆచూపు యిప్పటికీ నామనసులో నే బింబితమైవున్నది. ఆశ్చర్యమూ, సంతోషమూ, సిగ్గూ, ఒక్కమారుగా ఆమెనుచుట్టు ముట్టుకుంది. "ఏమీ? ఎవరూ? రైలులో—"

"ఔను. ఆశ్చర్య మెందుకూ? సిగ్గెందుకూ? నిన్నటినుంచీ లేనిసిగ్గు యిప్పుడు—" అంటున్నాను.

"నిజమేనా? మీరేనా?" అని కిందపడబోయింది.



మూర్ఛపోయిందో యేమో అర్ధగంట నాకౌగిట్లోనే వుండిపోయింది.

"ఔను; నిజమే; నేనే!" అంటూ ఆమెను కిందపడకుండా పట్టుకున్నాను. మూర్ఛపోయిందో, యేమో అర్ధగంట నాకౌగిట్లోనే వుండిపోయింద.

ఈపిల్లే ఆఖరుకు మాఅమ్మకు కోడలయింది!